క్లుప్తంగా

ఓంకారం హుండీ ఆదాయం రూ. 1,61,151



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

బండిఆత్మకూరు: మండలంలోని ఓంకారేశ్వ రాలయ హుండీ ఆదాయాన్ని ఆదివారం లెక్కించగా రూ. 1,61,151 లు ఆదాయం వచ్చినట్లు ఈఓ నాగ ప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్తీక మాసం ముగింపు సందర్భంగా హుండీలను తెరిచి లెక్కించినట్లు వెల్లడించారు. కార్యక్రమానికి పర్యవేక్షణాధికారిగా నంద్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి.హరిశ్చంద్రారెడ్డితో పాటు ఆలయ అర్చకులు మల్లికార్జున పాల్గొన్నారు.

సేవలతో గుర్తింపు



అల్లినగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మహానంది: సేవల ద్వారానే విద్యార్థులకు గుర్తింపు లభిస్తుందని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీర జయలక్ష్మి తెలిపారు. అల్లినగరం గ్రామంలో జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా రెండోరోజు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, మాధవి, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

చెత్త బుట్టల పంపిణీ



చెత్త బుట్టలు ప్రజలకు పంపిణీ చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

పాములపాడు: మండల కేంద్రం పాములపాడులో ఆదివారం పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ చెత్త బుట్టలు పంపిణీ చేశారు. 2,800 బుట్టలు మంజూరైనట్లు సర్పంచ్ మేకల బాగ్యమ్మ తెలిపింది. ప్రతి ఇంటికి 2 చొప్పున పంపిణీ చేస్తున్నారు. ఆ కుటుంబం రేషన్ కార్డు నంబరు నమోదు చేసుకుని బుట్టలు అందజేశారు.

సామూహిక అభిషేకాల వేదిక మార్పు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలో నిర్వహింపబడే సామూహిక ఆర్జిత అభిషేకాల నిర్వహణ స్థలాన్ని మార్పులు చేసినట్లు దేవస్థాన అధికారులు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగాణంలోని మూడు శివాలయాల వద్ద, అక్క మహాదేవి–హేమారెడ్డి మల్లమ్మ మందిరాల వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్కో విడతలో 100 టికెట్లు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు

ఆత్మకూరు: పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శతకూష్మాండాలతో స్వామివారిని అలంకరించి పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర విశేష పూజలు చేపట్టారు.

ట్రూ అప్ భారాన్ని ఉప సంహరించుకోవాలి

ఆత్మకూరు: రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులపై మోపిన రూ.9,142 కోట్ల ఎఫ్‌పీపీసీ ట్రూ అప్ చార్జీల భారాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు వద్ద విద్యుత్ బిలుల్లను దగ్ధం చేసి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్, ఎ.సురేంద్ర, సద్దాంహుసేన్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో కార్తీక వనభోజనం

కొత్తపల్లి: మండల కేంద్రం కొత్తపల్లిలో వెలసిన పార్వతీ సమేత తాండవ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం కార్తీకమాసం ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. అర్చకుడు మల్లికార్జున ఆచారి స్వామివారికి బిందెసేవ, అఖండ జ్యోతి, జలాభిషేకం, పాలాభిషేకం,మంగళహారతులు వంటి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వనభోజనం కార్యక్రమం పూర్తిచేశారు.

6న జాబ్ మేళా

నందికొట్కూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 6వ తేదీన జాబ్ మేళా కార్యక్రమం నిర్వహిస్తునట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు అక్సిస్ బ్యాంక్, ముత్తూటి ఫైనాన్స్, రోయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతునట్లు చెప్పారు. పదోవ తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, పీజీ అభ్యర్థులు అర్హులన్నారు.

వరి రైతుల్లో 'ఫెంగల్' వణుకు

- తుపాను ప్రభావంతో రైతుకు తప్పని తిప్పలు
- గాలులకు కుప్పకూలుతున్న వరి పంటలు
- కోత కోసిన వరిని ఆరబెట్టేందుకు అగచాట్లు పడుతున్న అన్నదాతలు



వరి ధాన్యాన్ని కుప్పలుగా పోస్తున్న రైతులు



వర్షానికి తడవకుండా ట్రాక్టర్లలో ధాన్యాన్ని ఇళ్లకు తరలిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఫెంగల్ తుపాను ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు మండలాలతో పాటు నియోజకవర్గంలోని మహానంది, బండిఆత్మకూరు మండలాల రైతుల్లో వణుకు పుట్టిస్తోంది. పది రోజుల క్రితమే డివిజన్ పరిధిలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. రైతులు కోత కేసిన వరి ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు పొలాల గట్లు, రహదారుల వెంట ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే ఊహించని విధంగా తుపాను ప్రభావంతో ఆత్మకూరు మండలంలో రెండు రోజులుగా గాలులతో కూడిన జల్లులు కురుస్తుండటంతో అన్నదాతల పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

విస్తారంగా వరి సాగు

శ్రీశైలం నియోజకవర్గంలో అత్యధికంగా రైతులు వరి సాగు చేశారు. చెరువులు, కె.సి.కెనాల్, తెలుగు గంగ ఆయకట్టు కింద వరి పంటను వేశారు. ఆత్మకూరు డివిజన్‌లోని ఆత్మకూరు మండలంలో 2,796 హెక్టార్లు, కొత్తపల్లి మండలంలో 3,876 హెక్టార్లు, పాములపాడు మండలంలో 1630 హెక్టార్లు, అలాగే మహానంది మండలంలో 7,830 హెక్టార్లలో వరి పంటను సాగుచేశారు. ఈ పంట అంతా ప్రస్తుతం కంకులతో నిండి కోత దశకు చేరింది. కొన్ని చోట్ల ఇప్పటికే వరి కోతలు కోసి పొలాల గట్లు, రహదారులు, కల్లాల్లో ఆరబోశారు. అయితే తుపాను ప్రభావంతో భారీగా గులులు వీస్తుండటం, చిరుజల్లులు కురుస్తుండటంతో అన్నదాతలు వరి ధాన్యాన్ని రక్షించుకునేందుకు పాట్లు పడుతున్నారు. కొందరు పట్టాలు కప్పి ఉంచుతుండగా.. మరికొందరు ట్రాక్టర్ల ద్వారా గోదాములు, ఇళ్లకు సంచుల్లో నింపుకుని తరలిస్తున్నారు.

దిగుబడిపై ప్రభావం

ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో వరి పంటను సాగుచేసిన రైతులు ఎకరాకు 20 నుంచి 40 బస్తాల దాకా ధాన్యం వస్తుందని ఆశిస్తున్నారు. సగటున 30 బస్తాల రావచ్చని భావిస్తున్నారు. అయితే ప్రస్తుతం తుపాన్ వల్ల ధాన్యం దెబ్బతినే అవకాశం ఉండడంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరకంగా మారింది.

తుపాన్ ఆందోళన కలిగిస్తోంది



ప్రస్తుతం వరి పంట కోత దశకు చేరుకుంది. ఈ పరిస్థితుల్లో తుపాన్ ఆందోళన కలిగిస్తోంది. వరి పంట కోత దశలో వర్షాలు కురిస్తే ధాన్యం తడిచి ముద్దయ్యే అవకాశం ఉంది. దిగుబడి నాణ్యత కోల్పోతే ధర తగ్గే ప్రమాదం ఉంది. ప్రస్తుతం వీస్తున్న గాలులకు వరి పంట నేలకొరుగుతోంది.

– వెంకటేశ్వర్లు, ఆత్మకూరు రైతు

పది రోజులు కోతలు వద్దు



బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్ వల్ల వర్షాలు కురిసే అవకాశం ఆత్మకూరు ప్రాంతంలో ఉంది. దీంతో వరి ధాన్యాన్ని కోయడం మానుకోవాలి. మరో పది రోజులు కోతను ఆపుకుంటే ధాన్యం తడవకుండా ఉంటుంది. కోత కోసినప్పుడు ధాన్యం తడిసే పరిస్థితి ఉంది. ఇప్పటికే కోతలు కోసిన రైతులు అప్రమత్తమై పంటను ఇళ్లకు తరలించి నిల్వ చేసుకోవాలి.

– విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఓ

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

జూపాడుబంగ్లా: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ లక్ష్మినారాయణ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎదుట కేజీరోడ్డుపై ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనచోదుకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు సామర్థ్యానికి మించి ప్రయాణికులను తీసుకెళ్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు నిబంధనలు పాటించని 12 మంది డ్రైవర్లకు రూ.2,020ల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసుల అదుపులో ఎంపీపీ

వెలుగోడు: స్థానిక ఎంపీపీ లాలం రమేష్‌ను వెలుగోడు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. గత నెల 8వ తేదీన ఎంపీపీకి చెందిన రైస్ మిల్లులో పోలీసులు, రెవెన్యూ అధికారులు సోదాలు నిర్వహించారు. మిల్లులో 20 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఎంపీపీని ఆదివారం స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ విష్ణునారాయణ తెలిపారు. అలాగే ఆత్మకూరు సీఐ సురేష్‌కుమార్ రెడ్డి వెలుగోడు స్టేషన్‌కు చేరుకొని విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఎంపీపీ లాలం రమేష్‌పై గతంలో ఏడు కేసులు నమోదైఉన్నట్లు చెప్పారు. బియ్యం అక్రమ వ్యాపారంపై రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడైనా కేసులు నమోదై ఉంటే వాటన్నింటినీ పరిగణలోకి తీసుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలాఉండగా ప్రభుత్వ మారడంతో కావాలనే కేసులు బనాయిస్తున్నారనే చర్చ జరుగుతోంది.

హైందవ ధర్మం గొప్పతనాన్ని తెలుసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న గిరిధర్

పాములపాడు: హైందవ ధర్మం గొప్పతనం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ నాయకులు గిరిధర్, రఘురాంలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీ విరాట్ పోతులూరి బ్రహ్మేంద్రస్వామి ఆలయం ఆవరణంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో హిందూ దేవాలయాలను రాజకీయాలు, ప్రభుత్వం నుంచి విముక్తి చేయడానికి విశ్వ హిందూ పరిషత్ సంకల్పించిందన్నారు. ఇతర రాష్ట్రాల్లోని కాశీ, అయోధ్య, లాంటి దేవాలయాల కోసం న్యాయ స్థానాల్లో పోరాడి స్వతంత్రంగా హిందువులే దేవాలయాల నిర్వహణ బాధ్యతా చూస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో అతి పవిత్రమైన తిరుపతి తో పాటు ప్రముఖ దేవాలయాల నిర్వహణ హిందువులకే అప్పగించాలన్నారు. ఇందు కోసం జనవరి 5న విజయవాడలో తలపెట్టిన హైందవ శంకారావం కార్యక్రమానికి వేలాదిగా హిందువు తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

హిందువుల సత్తా చాటాలి

మహానంది: జనవరి 5న విజయవాడలో జరగనున్న హైందవ శంఖరావాన్ని విజయవంతం చేయాలని బళ్లారికి చెందిన పీఠాధిపతి శ్రీ నిత్యానంద భారతి స్వామి పిలుపునిచ్చారు. బుక్కాపురంలోని రామాలయంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. వీహెచ్‌పీ ఖండ కార్యవాహక కాశయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతుండటం బాధాకరమన్నారు. ప్రతి హిందూ సోదరుడు ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, సమరసత సేవా ఫౌండేషన్, ఆర్ఎస్ఎస్ నాయకులు శ్రీనివాసులు, నాగచందు, రామకృష్ణయ్య, చంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా వైద్య శిబిరానికి విశేష స్పందన

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని శ్రీకృష్ణ యాదవ నిత్యాన్నదాన సత్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మార్కాపురం నుంచి వచ్చిన 11 మంది ప్రముఖ వైద్య నిపుణులు 400 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. లక్ష్మీ ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరానికి దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అవసరమైన వారికి తదుపరి పరీక్షల నిమిత్తం మర్కాపురంలోని తమ ఆసుపత్రికి రెఫర్ చేశారు. పుట్టుకతో మూగ వారికి పీఎల్‌పీ యాదవ్ పలు సూచనలు చేస్తూ స్వచ్ఛంద సంస్థల ద్వారా తమ సహకారం అందజేస్తామని తెలిపారు. శిబిరంలో డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సీతారామిరెడ్డి, డాక్టర్ సంజీవ్, ఊర్మిళ యాదవ్, డాక్టర్ సాయి కష్ణ యాదవ్, బసవయ్య, నాసరయ్య, డాక్టర్ కనిగిరి ఎలిక హరిబాబు యాదవ్ తదితరులు వైద్యసేవలు అందిచారు. సత్రం మేనేజర్ రాగాల శివయ్య, సిబ్బంది వైద్యం కోసం వచ్చిన వారికి ఉచితంగా భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.



వైద్య శిబిరంలో వైద్య పరీక్ష చేయించుకుంటున్న దేవస్థానం ఈఓ

ఆలయాలు ధర్మప్రచార కేంద్రాలు



పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతిస్వామికి ప్రసాదాలిస్తున్న ఈఓ, వేదపండితులు

మహానంది: ఆలయాలు ధర్మప్రచార కేంద్రాలని, ధర్మపరిరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించి హిందూయేతరుల కుట్రలను తిప్పికొట్టాలని బండిఆత్మకూరు మండలం కాకనూరు శ్రీ శారదా పీఠం పీఠాధిపతి శ్రీ శివయోగేంద్ర సరస్వతి మహాస్వామి అన్నారు. కార్తీకమాసం, అమావాస్య సందర్భంగా ఆదివారం మహానందిలో పూజలు నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ధర్మబద్ధంగా జీవనం సాగించడం ద్వారా జ్ఞానవంతులవుతారన్నారు. ఆలయాలు ధర్మానికి వారధిగా ఉండాలని కాంక్షించారు.

మల్లన్న సన్నిధిలో తెలంగాణ మంత్రి సీతక్క

శ్రీశైలంటెంపుల్: తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దంసారి అనసూయ (సీతక్క) ఆదివారం శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంత్రి సీతక్కతో నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఉన్నారు. మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన మంత్రి సీతక్కకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన అధికారులు, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మల్లికార్జున స్వామి వారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో మంత్రికి వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అధికారులు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

ఆర్టిజన్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

శ్రీశైలంప్రాజెక్ట్: తెలంగాణ పరిధిలోని ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో ఎన్నో ఏళ్లగా పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని మంత్రి సీతక్క, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఆదివారం శ్రీశైలంలో కార్మికులు వినతిపత్రం ఇచ్చారు. గత 25 సంవత్సరాలుగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేస్తామని గత ప్రభుత్వ హామీ ఇచ్చి, ఆర్టిజన్ కార్మికులుగా విలీనం చేసిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణా విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ నాయకులు ఎస్.కె.ఇబ్రహీం, ఎ.శివశంకరరెడ్డి, బి.లక్ష్మయ్య పాల్గొన్నారు.



ఆలయ రాజగోపురం వద్ద మంత్రి సీతక్కకు స్వాగతం పలుకుతున్న దేవస్థాన అధికారులు

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన

పగిడ్యాల: మండలంలోని తూర్పు ప్రాతకోట గ్రామంలో వెలసిన గంగా పార్వతీ నాగేశ్వరస్వామి ఆలయంలో లక్ష్య బిల్వార్చన వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. పురోహితులు రామయ్య, జగదీశ్వర శర్మ, బాలకృష్ణ శర్మ బృందం శాస్త్రోక్తంగా నిర్వహించిన బిల్వార్చన వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. శివునికి అత్యంత ప్రీతికరమైన బిల్వం ఆకులను నాగేశ్వరస్వామికి సమర్పించి భక్తిని చాటుకున్నారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో వైభవంగా నిర్వహిస్తూ వస్తున్న ఆనవాయితీని గ్రామ పెద్దలు కొనసాగించారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య నాగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నూతన రథోత్సవ నిర్మాణానికి దోహదపడిన వారిని, కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వైద్య సేవలు అందించిన డాక్టర్ క్రిష్ణమూర్తి, వైద్య సిబ్బందిని ఘనంగా సన్మానించారు. సాయినృత్య కళాశాల చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



బిల్వార్చన వేడుకలను జరిపిస్తున్న పురోహితులు

శ్రీశైలంలో ముగిసిన కార్తీక మాసోత్సవాలు



శ్రీశైల క్షేత్రానికి పొటెత్తిన భక్తులు



దీపారాధన చేసుకుంటున్న భక్తులు



రుద్రకోడులో శివుడికి క్షీరాభిషేకం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా జరిగాయి. నవంబరు 2న ప్రారంభమైన మాసోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. మాస చివరి రోజు ఆదివారం కూడా భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. కార్తీకమాసంలో ఇలకైలాసమైన శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మ వార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఈ మాసమంతా భక్తుల శివనామస్మరణతో శ్రీగిరి మారుమోగింది. ఈ మాసంలోని నాలుగు సోమవారాలు, కార్తీక పౌర్ణమి రోజున శాస్త్రోక్తంగా లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి నిర్వహించారు. అలాగే పౌర్ణమి రోజున వైభవంగా జ్వాలా తోరణోత్సవం, పుణ్యనదీహారతి కార్యక్రమాలు నిర్వహించారు. మాసోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం దేవస్థానం విస్తత ఏర్పాట్లు చేసింది. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, తాగునీరు సరఫరా, స్వామిఅమ్మవార్ల ఆర్జితసేవలు, పారిశుద్ధ్యం మొదలైన వాటికి సంబంధించి పలు ఏర్పాట్లు చేశారు. ఈ మాసమంతా ప్రతిరోజు ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపాన్ని వెలిగించారు. వేకువజామున 3.30గంటలకు ఆలయ ద్వారాలు తెరచి ఉదయం 4.30 నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు, తిరిగి సాయంత్రం 5.30 నుంచి రాత్రి 11గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులకు అన్నదాన భవనంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3.30గంటల వరకు అన్నప్రసాదాల వితరణ, సాయంత్రం అల్పాహారం అందజేశారు. క్యూకాంప్లెక్స్‌లో వేచిఉండే భక్తులకు మంచినీరు, బిస్కెట్లు, అల్పాహారం అందజేశారు.

రుద్రకోడులో పూజలు

ఆత్మకూరు: కార్తీకమాసం చివరి రోజు ఆదివారం భక్తులు రుద్రకోడు పుణ్యక్షేత్రంలో వెలిసిన రుద్రకోటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. పలువురు భక్తులు శనివారం రాత్రి రుద్రకోడుకు చేరుకుని వేకువజామున స్నానమాచరించి శ్రీ రుద్ర కోటేశ్వర, శ్రీ రుద్రాణిమాతకు పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, విశేష పూజలు చేపట్టారు. పట్టణంలోని శివాలయంలో కార్తీక దీపాలను వెలిగించి మహాశివుడు, పార్వతీమాతకు పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని సాయిబాబా, వెంకటేశ్వర స్వామి, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయాల్లో కూడా కార్తీకమాస పూజలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించారు.

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన బరక సంజీవరాయస్వామికి కార్తీక అమావాస్య ఆదివారం పురస్కరించుకొని అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన తదితర విశేష పూజలు పురోహితులు నరహరి శర్మ, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీ దత్త ఆశ్రమ వ్యవస్థాపకులు, వేదపండితులు శ్రీ జూలకంటి మల్లికార్జున రావు, ఆలయ చైర్మన్ పేరెడ్డి మురళీమోహన్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు గౌరీ మోక్షేశ్వరస్వామి దేవాలయంలో లక్ష బిల్వార్చన

పగిడ్యాల: కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురష్కరించుకుని మండలంలోని పడమర ప్రాతకోట గౌరీ మోక్షేశ్వరస్వామి దేవాలయంలో లక్ష బిల్వార్చన, దుర్గా సహిత రుద్రహవనం, స్వామి కల్యాణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 11 గంటలకు లక్ష బిల్వార్చన వేడుకలు పురోహితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని, భక్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలి

ఆత్మకూరు: రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, దేవాలయపై జరుగుతన్న దాడులను ఆపాలని హైందవ శంఖారావం ప్రతినిధులు ఎం.వేణుగోపాల్, జి.సత్యనారాయణశర్మ, బి.లక్ష్మినారాయణ ఆచార్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు పట్టణంలోని జి.పుల్లారెడ్డి స్కూల్‌లో మండల స్థాయి హిందూ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా హిందూ దేవాలయాలకు సనాతన ధర్మ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అన్యాక్రాంతమవుతున్న ఆలయ భూములను కాపాడాలన్నారు. జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షుడు సుదర్శనశర్మ, హైందవ శంఖారావం తాలూకా కన్వీనర్ వాసుదేవరెడ్డి, ఆవుల రెడ్డి, మారం భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహానంది భక్తులతో కిటకిట



మహానంది రాజగోపురం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మహానంది: కార్తీకమాసం చివరిరోజు, అమావాస్య, ఆదివారం కావడంతో మహానంది ఆలయం భక్తజనంతో కిటకిటలాడింది. వేలాది మంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాధారణ భక్తులతో పాటు అయ్యప్పదీక్షా స్వాములు అధికంగా వచ్చారు. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవారి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. రాత్రి ఆలయ రాజగోపురం ముందు ఉన్న నంది విగ్రహం వద్ద భక్తులు కార్తీకదీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

మహానందీశ్వరుడి దంపతులకు కల్యాణోత్సవం

మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు ఆదివారం కార్తీక మాసం, అమావాస్య సందర్భంగా ఉదయం కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెందూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతు శర్మల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగళ్య ధారణ, అక్షింతల సమర్పణ వైభవంగా జరిగాయి. పలు ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి పూజలు చేశారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామి, అమ్మవార్ల ప్రసాదాలు అందించారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి



ఆత్మకూరులో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఎయిడ్స్ పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ ఆసియా మారూఫ్, టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, జబీబుల్లా అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలో మేరీ బసవచంద్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. గౌడ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఎయిడ్స్ పట్ల ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మెరీబా టీఐ స్టాఫ్ ఎం.రాజు, లక్ష్మినరసింహ, అరుణకుమారి, సంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: అంతీర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం సున్నిపెంటలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడతామని ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్లు సోహైల్, యజ్ఞసాయి ప్రసాద్ ఎయిడ్స్ నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెడ్‌నర్స్ విజయలక్ష్మి, ఐసీటీసీ కౌన్సిలర్ బురుగన్న, మెరిబా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు దమయంతి, లక్ష్మి పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్.పి.హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు.

ఎయిడ్స్‌పై అవగాహన

బండిఆత్మకూరు : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు భావనా రెడ్డి ఆధ్వర్యంలో ఎయిడ్స్, హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ సుశీల, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.